# ప్రశాంతనిలయం ....

రచన : (శోభశ్రీ) సాయిప్రకాశ్.

అది 'ప్రశాంతనిలయం' పేరుకు ప్రశాంత నిలయమే కాని దానికి 'గందరగోళనిలయం' అని అంటే బాగుంటుందేమో! అది మా తాతగారి సుందరభవనం.మా స్వగ్రామం అయిన బొండపల్లిలో తగిన సదుపాయాలు లేనందున ఈ ఊరిలో చదువు, సంగీతం నేర్చుకుందామని మా తాతగారింట్లో ఉంటున్నాను లెండి. నేను ఈ ఊరికి అంటే విజయనగరం వచ్చి ఒక సంవత్సరం మాత్రమే అయింది. కిందటి సంవత్సరమే పాసయ్యాను ఎస్సెల్సీ. ఇంతకీ మా తాతగారి నిలయాన్ని గందరగోళనిలయమని తెలుపుటకు తగిన కారణాలు కూడ విశదపరచాలి కదా! మరి కారణాలు తెలపాలంటే తగిన కారకులనుకూడా తెలపాలికదా, మరెవ్వరూకాదు. ఆ నిలయంలోని నివాసకులే. అందరితోనూ నా దినచర్యలో గల అనుభవాలు. తగిన కారణాలు నేను తెలుపుతూ కూర్చుంటే వెంటనే మీరు మీ చేతిలో ఉన్న పుస్తకాన్ని విసిరికొట్టడానికి అవకాశాలున్నాయి. కాని అలా చేయవద్దని సంపాదకుని తరఫున నేను మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. కారణం చెప్పమంటారా! ఇది నా మొట్టమొదటి గందరగోళంకథ 'ఇది నా మొట్టమొదటిరచన గాబట్టి వెంటనే ఎటువంటి అభ్యంతరం లేక ప్రచురిస్తారని తలుస్తున్నాను' అని ఒకలేఖ వ్రాశాను లెండి! ఆ పిమ్మట ఆయనగారిఇష్టతమీద అంతా ఆధారపడి ఉంటుంది. ఆ! ఇంతకి అసలు కథని వదిలేశాను.

అనగా అనగా 'మాతాతగారు' ప్రశాంత (గందరగోళ) నిలయములో నివసించుచుండెవారు.ఇదేదో కాశీమజిలీకథలా ఉందనిమీరు భావించకండి. నా కథను మీరందరూ చదివి మీపొట్ట చెక్కలయి పోతుందేమో నవ్వలేక! అందువలన నేను కథను మొదలుపెట్టే విధానం మారుద్దామనుకుంటున్నా. ఇంతకీ మీరు ఒక విషయం గమనించారా! ఈ మధ్య ఈ రచయితల హృదయాలనే సాగరంలో భావాలనే తరంగాలు వెల్లువలై ప్రవహిస్తున్నాయి. వాటిని ప్రజాహృదయాలనే తీరానికి హత్తుకునేటట్లు చేయడానికి మన ఆధునిక రచయితలకు శక్తికూడ జలపాతంలా ఉరకలువేస్తూంది లెండి! కాని ఈమధ్య ఒక పత్రికలో ఒక ప్రకటన చూసే ఉంటారు. 'రచయితలు తాము పంపే రచనలతోపాటు తమ రచన స్వంతదేననీ ఎచ్చటా కాపీ కొట్టలేదనీ, దేనినీ అనుసరించలేదనీ, వ్రాసియుండే దృవపత్రాన్ని పంపుతేగాని వారి రచనలను స్వీకరించబోమని ప్రకటించారు ''కదా! దీనిని బట్టి కొందరి సంపాదకులకు రచయితలమీద నేడు కలుగుచున్న 'చిన్నచూపు'వలన నాకు (నేను అంత రచియితని కాకపోయినా!)చాలా అవమానంగా ఉందని తెలుపుటకు మిక్కిలి విచారిస్తున్నాను! కాని రచయితలు కూడా తాము చేసే రచనలకు కొంత బాధ్యతను గుర్తెరిగి యుండాలనే విషయం ప్రతీ రచయితా తెలిసికొనియుండాలనే మాట వాస్త

వమే. కాని ఒక విషయం మాత్రం అక్షరాల నిజం. ప్రతీ ఆధునిక రచయిత నిత్యజీవితంలో జరిగే ఏదో ఒక సంఘటనని ఆధారంగా చేసి కొని తన రచనను కొనసాగిస్తాడనటంలో సందేహపడనవసరంలేదు.

ఇక నేను కొద్దిగా తగ్గుతే బాగుంటుందేమో! అసలు కధని మొదలెడదామని అనుకుంటున్నాను.

అది మా తాతగారి బంగళా. ఆయన విజయనగరంలో పేరు మోయని వకీలు! ఆయనకొక రత్నం వంటి భార్యారత్నం. ఆ భవనానికి మెర్క్యురీదీపమై ఎల్లవేళలా తన వాక్ప్రవాహమనెడి విద్యుత్తుచే ప్రకాశిస్తుంటుంది. దంపతులిద్దరూ వయసుమళ్ళినవారే. సంతానం లేకపోవడంవల్ల పిల్లలంటే మహాసరదా, అందువలన నేనుకాక మా బంధువులకు చెందిన పిల్లలూ కొందరు ఆ బంగాళాలో మకాం ఉంటారు. అసలే మా మాతగారి నిలయం పురాతనమైనది. అందులో ఆ పిల్లలుచేసే అల్లరికి అది కూలిపోతుందేమో ననిపిస్తుంది. అయినా ఎలాగో దానిని వదలటం ఇష్టంలేక అలా కాలం గడుపుతున్నారు.

మా తాతగారు (పేరుమోయని) వకీలు కదా! ఆయనకి మరి కేసులేవీ ఉండవా అని అడిగితే మాత్రం వెంటనే నావద్దనుండి ఒక జవాబు వస్తుంది. ఈ విషయంలో మాత్రం నేను కొద్దిగా సానుభూతి చూపదలచుకున్నాను. పూర్వం కొద్దిగా అడపాదడపా కేసులుండేవనుకోండి. ఈమధ్యనే కరెంట్ షాక్ వలనజ్ఞాపకశక్తికి సంభందించినఇంద్రియం దెబ్బతినటంవలన జీవితాంతం పూర్తిగా విశ్రాంతి తీసికోవలసివచ్చింది! అన్నట్లు మరో విషయం మీకు విన్నవించడం మరిచాను. మా తాతగారు ఆరితేరిన అనువాదకులు. సంపూర్ణరామాయణాన్ని ఇంగ్లీషులోకి అనువదించారంటే మాటలా! కాని ఆ అనువాదాన్ని చాలా కాలంబట్టి ఆయనిగారి పుస్తకాల బీరువాలో పదిల పరిచారులెండి! ప్రచురించేవాడెవడూలేక! తరువాతి విషయం ఆయన వకీలుగనుక వకీలుకుండవలసిన లక్షణం ఆయనలో మూర్తీభవించి ఉన్నాయిలెండి!

ఇంకా మా తాతగారి గురించి చెప్పాలంటే చాలా విషయాలున్నాయి లెండి! మా నిలయంలో ఉదయాన్నే మేల్కొనేది ఎవరూ అంటే మా తాతగారే! లేపగానే దంతధావన, స్నాన పానాదులు ముగించుకొని జపానికి (జపాన్‌కి మాత్రం కాదండోయ్!) సన్నాహాలు మొదలవుతాయి. ఈ మధ్యలో కొన్ని సంఘటనలవల్ల ఆ నిలయానికి క్రొత్తవారైతే కొద్దిగా ఇబ్బంది పడాల్సొస్తుంది. ఆ సమయంలో పడుకున్నవారికి కొద్దిగా చికాకుగా ఉంటుంది. అవి కొన్ని రకాలైన శబ్దాలు లాంటివి. అవి ఏమిటనుకోవాలో కొంతసేపు ఆలోచిస్తేగాని అర్థంకావు. మరేంకావు, శ్లోకాలు, పద్యాలు! ఆయన కంఠస్వరం గంభీరంగా ఉంటుందిలెండి. ఇక ఆ సంగతి అలా అట్టే పెడదాం. ఇంకొక రంగంలోనికి మారుదాం. పొరపాటున ఇది నాటకం అనుకునేరు.

సాధారణంగా బంగళాలనేవి జమిందారుల

కుండవలసినవి మా తాతగారి నివాసాన్ని 'బంగళా' అని ఎందుకన్నానంటే వారి పూర్వీలు 'జమిందారు గిరీ' వెలగబెట్టారట. కాని అంత పెద్ద భవనంలో పనులు సక్రమంగా నెరవేర్చడానికి నౌకరులు ఎవరూ లేరు. అన్నిపనులూ మనమే! (కొన్ని మినహాయిస్తే) సరే! కాయగూరలు బజారుకెళ్ళి తేవడం నా దినచర్యలో ప్రధానమైనవిషయం. పోనీ కష్టపడి తెస్తానా? ఓరేయ్ ఖరం! (అన్నట్లు నాపేరు తెలపడం మరిచాను. నా అసలు పేరు శేఖరం, ముద్దుపేరు 'ఖరం') ఈ వంకాయలు వీశ అర్థరూపాయి పెట్టి ఎందుకురా కొన్నావు ఐదణాలకు బేరం చెయ్యకపోయావా? అనే పలురకాలుగ ఏదో ఒక విషయమై పేచీ పడటం మా అమ్మమ్మా తాతగార్లకి అలవాటయిపోయింది, మరో ముఖ్యమయిన విషయం నేనేంపనిచేసినా మా తాతగారివద్ద చేయడం అంటే తలనొప్పి. నేనేదిచేసినా దాని గురించి లక్ష ప్రశ్నలు వేయడం అయనకో దురభ్యాసం క్రింద మారిపోయింది, దానికీ కొంత నియమం అంటూ ఉండాలికదా! కాని ఇచ్చట గమనించవలసిన విషయం ఒకటి ఉంది. మా తాతగారు మమ్మల్ని అడిగే ప్రశ్నలన్నీ మామంచికొరకే అడుగుతారనేది చాల ముఖ్యం.

ముఖ్యమయిన విషయం మరొకటి. నాకొక ప్రాణస్నేహితుడున్నాడు. వాడి పేరు సుబ్బారావు. వాడు మాయింట్లో ప్రతిరోజూ రావటం అలవాటు. వాడితో నాకుగల పరిచయాన్ని చూసి మా తాతగారు కూడ వాడిని 'సుబ్బా' అని ముద్దుపేరుతో పిలవడం అయనకి అలవాటయిపోయింది. వాడికి సాహిత్యం అంటే మహా ఇష్టం.

అందువలన సుబ్బారావు మా తాతగారికి ప్రాణస్నేహితుడుగ మారిపోవడంలో సంశయింపనవసరంలేదు. వారు సాధారణంగా చర్చించే విషయాలు ప్రాచీనకవులు గురించి మా తాతగారు పోతనగురించి చర్చిస్తే మన సబ్బు (సుబ్బు) శ్రీనాధుని గురించి, మా తాతగారు షేక్స్పియరుగురించి చర్చిస్తే మావాడు కాళిదాసు గురించి ఈవిధంగా వారి చర్చ ఎత్తునుండి పల్లానికి ప్రవహించే నీటి ప్రవాహంలా సాగిపోతుంది. ఇంతకీ సుబ్బారావు నా స్నేహితుడెలా గయ్యాడూ? అంటే మేమిద్దరం ఈ ఊరి కాలేజీలో పి.యూ.సీ. చదువుతున్న అధునిక విద్యార్థులం. ఒకే క్లాసు, ఒకే సెక్షను, ఒకే బెంచి. ఒకే హృదయం. (తనువులు వేరైనా)

ఇక మా తాతగారికి మా సుబ్బుని నన్నూ కలిపి కూర్చోబెట్టి ఏ ఆదిభట్ల నారాయణ దాసు గురించో లేకపోతే ఏ విశ్వనాథ సత్యనారాయణ గురించో ఉపన్యాసం ఇవ్వటం ఒక అలవాటయిపోయింది. మా సుబ్బుకైతే ఉత్సాహంగా ఉంటుందిగాని నాకు మాత్రం భరించలేనంత బాధగా ఉంటుంది! ఈవిధంగా ఎవరో ఒకరు మాట్లాడుతూండడంతోనో, పిల్లల అల్లరితోనో ఆ ప్రశాంత నిలయమనే మా తాతగారి ''బంగళా'' గందరగోళ నిలయంగా క్రమేణా మారిపోయింది. రాశిన

(తరువాయి 26వ పేజీలో)

(13వ పేజీ తరువాయి)

కూచున్నపుడు' అన్నది అబ్బాయి తండ్రి సమాధానం. 'పేకాట ఏ ఏ వేళల్లో ఆడతాడు?' అని అమ్మాయి తండ్రి ప్రశ్నిస్తే 'అబ్బే అన్ని వేళల్లోను కాదు. ఇంత సారాయి త్రాగినపుడు మాత్రమే!' అని అబ్బాయి తండ్రి పలుకుతాడు. 'సారాయి ఏ ఏ సమయాల్లో త్రాగుతాడు?' అని అమ్మాయి తండ్రి మరల ప్రశ్నిస్తే' అబ్బే! దానికో సమయమంటూ ఉండదు. కావలసినపుడంతా త్రాగటానికి డబ్బుండాలగా. అందువల్ల ఎప్పుడుబడితే అప్పుడు త్రాగడు. ఏవో ఒకటి రెండు జేబులు కొట్టినపుడు మాత్రం...' అని అబ్బాయి తండ్రి జవాబిస్తాడు. ఇవన్నీ విని అమ్మాయి తండ్రి 'నా కూతురును మెడబట్టి బావిలోనికైనా త్రోస్తానుకానీ నీ కొడుక్కుమాత్రం ఇవ్వను' అని ఢంకా బజాయించి చెప్పటం జరిగుంటుందనే విషయం ఎల్లా ఉన్నా, ఆ దురలవాట్లలో ఈ సిగరెట్టు చేర్చబడటం గమనార్హం. అంతెందుకూ: అన్నివిధాల అభివృద్ధిచెందిన అమెరికా వంటి అగ్రరాజ్యంలోనే సిగరెట్లు కాల్చటంవల్ల అదేదో (?) వ్యాధివచ్చి చచ్చిపోయే ప్రమాదముందనే హెచ్చరికలు అధికారిక ప్రకటనల్లో తెలియచేయబడుతోంది. ఈమధ్య అమెరికా సెనేట్ 'పొగ'కు సంబంధించి, అధిక మెజారిటీతో ఒకానొక బిల్లును ఆమోదించిందట. తత్ప్రకారం ఐతే 'హెచ్చరిక: సిగరెట్లు కాల్చడం మీ ఆరోగ్యానికి ప్రమాదం తెచ్చిపెట్టవచ్చు' అని ప్రతి సిగరెట్ల ఉత్పత్తిదారుడూ, సిగరెట్టు పెట్టమీద, కట్టమీద ముద్రించాల్సుంటుందట. దీనినిబట్టి చూస్తే నడుస్తున్న చరిత్రలో పొగ త్రాగటం ప్రమాదకరమని ఇటీవలనే ఎక్కువగా తెలుసుకోటం జరుగుతున్నట్టుంది. ఏది ఏమైనా సిగరెట్లు చాలావరకు సరదాకోసమనుకున్నా, కొంతవరకు హుషారుకోసమనుకున్నా, కొంతవరకు వ్యసనాలను మరచిపోటానికనుకున్నా, కొంతవరకు ఆకలి నణచుకోటానికనుకున్నా, కొంతవరకు ఫ్యాషనకనుకున్నా, కాలక్షేపానికనుకున్నా, మరేమనుకున్నా పట్టుబట్టి ఈ సిగరెట్టును ఒక్క దమ్ముకొట్టితే అది స్వర్గానికి తొలిమెట్టు కాగలదో మలిమెట్టు కాగలదోనన్న విషయంమటుకు పట్టుబట్టి ఆ సిగరెట్టును గట్టి ఇంటరెస్టుతో టేస్టు చేసే మానవులకే పట్టుబడుతుందికానీ, అన్యులకు అవగతం కాదు.

మరి, ప్రస్తుత సభ్యతప్రపంచంలో అంతటి ఆదరణను బొంది, ఈ నవనాగరిక లోకంలో ఇంతటి స్థానాన్ని సంపాదించుకోగలిగిన సిగరెట్ ఆరోగ్యానికి భంగకరమైనదనే విషయం ఎంతవరకూ నిజమన్నదాన్ని కేవలం కాలమే నిర్ణయించాల్సుంటుంది....


## కథాంజలి

(కథల మాస పత్రిక)

స్థాపితము 1938.

విడి ప్రతి. ... 25 పై. లు

సంవత్సర చందా. ... రూ. 4-00

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాథమ్స్, మరియు స్వదేశ మిత్ర బుక్ స్టాల్సులలోను దొరుకుతుంది.